మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

7.4.2026 మంగళవారం Tuesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 347 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar



## వర్షార్పణం..



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# ఒక్కరోజులో అంతు తేలుస్తాం



### ఇరాన్‌ను మట్టుబెట్టేస్తాం

### అది ఈ రోజు రాత్రే కావొచ్చు

- నేను చాలా నిరాశకు గురయ్యాను
- టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు
- మా పైలట్ను రక్షించుకోగలిగాం
- రెస్క్యూ గురించి ఇరాన్‌కు ముందే తెలిసింది
- ఎవరో లీక్ చేశారు.. అతడికి శిక్ష తప్పదు
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

4


ఇరాన్‌ను ఒక రాత్రిలో నిర్మూలించవచ్చని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అది మంగళవారం సాయంత్రం నాటికి జరగవచ్చని సూచించారు. ఇరాన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై బాంబు దాడికి మంగళవారం గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యం లో ఆయన సోమవారం వైటాస్లో విలేకరులతో మాట్లాడారు.

### బెదిరింపులకు తలొగ్గం

- హార్ముజ్ ను తెరవం!
- కాల్పుల విరమణపై ఇరాన్
- మా డిమాండ్లు మాకున్నాయి

# 9మంది పోలీసులకు ఉరిశిక్ష

- తమిళనాడులోని సాతన్ కుళం లాకప్‌డెత్ కేసు
- మధురై సెషన్స్ కోర్టు సంచలన తీర్పు
- కరోనా సమయంలో పోలీసుల వేధింపులు
- చిత్రహింసలతో తండ్రీకొడుకుల మృతి
- సుమోటోగా కేసు నమోదు.. విచారణ..
- ఆరేళ్ల తర్వాత నిందితులకు శిక్ష ఖరారు



04



# ఆదిగాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా



- తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
- జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

**జనతా న్యూస్,ఆదిలాబాద్ :** గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి

మిగతా 2 లో

### హామీలను అమలు చేసిన ఘనత మాది

- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం
- మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

### అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం

### పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ




04

భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయనీ, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందనీ పేర్కొన్నారు.

## చంద్రుడి కక్ష్యలోకి ఆర్టెమిస్-2 మిషన్

నేటి తెల్లవారు జామున చేరుకునే ఛాన్స్



04

## బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

### మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ



03



## ఓటర్ జాబితా అప్‌డేట్‌కు గడువు

### సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

.. వివరాలు 2లో

# సర్కార్ భూములపై కాంగ్రెస్ గద్దలు!

### ఫ్రూట్ మార్కెట్ భూమిపై రేవంత్ కన్ను

- నాడు కేసీఆర్ ప్రభుత్వం ఈ మార్కెట్కు భూములు కేటాయించింది
- రూ.3 వేల కోట్ల విలువైన 200 ఎకరాలు ప్రైవేటుకు దోచిపెట్టేందుకు యత్నం
- తరలించాలని చూస్తే సహించేది లేదు
- కోహెడ పండ్ల మార్కెట్లో మీడియాతో హరీష్ రావు

వివరాలు 3 లో

భూములను తన్నుకుపోయేందుకు గద్దల్లా తిరుగుతున్న కాంగ్రెస్ పాలకులను రైతాంగ పోరాటాలు చుట్టుముట్టక తప్పవని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత హరీష్ రావు హెచ్చరించారు. అంగుళం భూమి కనిపించినా ఆక్రమించుకునేందుకు సిద్ధమవుతున్న రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజల్లో దోషిగా నిలబడే ఘడియలు ఆసన్నమవుతున్నాయని అన్నారు.



మానేరు
జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
మంగళవారం 7 ఏప్రిల్ 2026


# తెలంగాణ ప్రభుత్వంపై విజయన్ విమర్శలు

## కేరళ సిఎంతో చర్చకు సిద్ధమని రేవంత్ సవాల్

**హైదరాబాద్,ఏప్రిల్ 6 :** తెలంగాణ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కేరళ సిఎం సపినరయ్ విజయన్‌కు సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణ ప్రభుత్వంపై కేరళం సీఎం పినరయి విజయన్ విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో స్పందించారు. తెలంగాణ అభివృద్ధిపై మితో చర్చకు తాను సిద్ధమని కేరళం సీఎం పినరయి విజయన్‌కి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 7వ తేదీన కేరళ రాజధాని తిరువనంతపురంలో ముఖాముఖి చర్చకు సిద్ధమని పినరయి విజయన్‌కు సీఎం రేవంత్ సవాల్ విసిరారు. తెలంగాణలోని పాత డేటాతో సీఎం విజయన్ విమర్శలు చేశారని వివరించారు. 2023 డిసెంబర్ నాటికే ఆ పాత డేటా శకం ముగిసిందన్నారు. తెలంగాణ వృద్ధి రేటు టాప్‌లో ఉందని వివరించారు. 2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీ 10.1 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశామని చెప్పారు. అలాగే 25.36 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చామని తెలంగాణ సీఎం సోదాహరణగా వివరించారు. గడచిన 28 నెలల్లో 67,763 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని గణాంకాలతో సహా వివరించారు. కేరళంలో బ్రెయిన్ డ్రైన్ పెరిగిపోయిందంటూ సీఎం రేవంత్ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా ఆ రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధి సైతం కుంటుపడిందని తెలిపారు. ప్రముఖ నటుడు మోహన్ లాల్ ఫేమస్ డైలాగ్ 'నీ పో, మోనే విజయన్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేరళం అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున కేరళంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళంలోని పినరయి విజయన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దాంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కేరళ సీఎం సంధించారు. దీంతో కేరళ సీఎం వ్యాఖ్యలకు కౌంటర్‌గా సీఎం రేవంత్ స్పందించారు.

# ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు

## ఈ యేడాది ఆకుపచ్చ రంగులో సారె

## పిప్పి సభలో సిఎం రేవంత్ ప్రకటన

**ఆదిలాబాద్,ఏప్రిల్ 6 :** గత ప్రభుత్వాల హయాంలో పంపిణీ చేసిన చీరల రంగులు, నాణ్యతపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉండేవని గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం మహిళల మనసు గెలుచుకునేలా కొత్త నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో జరిగిన భారీ బహిరంగ సభలో మహిళా లోకానికి బతుకమ్మ శుభవార్త చెప్పారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం ఇచ్చే చీరలు కేవలం వస్త్రాలు మాత్రమే కాదని.. అవి పుట్టింటి వారు ప్రేమతో పెట్టే 'సారె' అంత పవిత్రమైనవని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గతంలో పాలపిట్ట రంగు చీరలను పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి అంతకంటే ఆకర్షణీయమైన, మహిళలకు ఎంతో ఇష్టమైన 'చిలుక పచ్చ' రంగు చీరలను అందించబోతున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేకమైన చిలుక పచ్చ రంగు చీరలను వచ్చే డిసెంబర్ నెలలో పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పండగలు, శుభకార్యాల సమయంలో ఆడబిడ్డలు గర్వంగా ధరించేలా నాణ్యమైన చీరలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల గౌరవాన్ని పెంచేలా, వారి ముఖాల్లో చిరునవ్వులు చూసేలా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. ఆదాయం పెంచి పేదలకు పంచడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని.. ఇప్పుడు నాణ్యమైన చీరల పంపిణీ ద్వారా ఆడబిడ్డల పట్ల తమకున్న అంకితభావాన్ని చాటుకుంటున్నామని చెప్పారు. మహిళా శక్తిని గౌరవించడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# కెసిఆర్ కార్యాలయంపై దాడి

## గజ్వేల్ బంద్‌తో మూతపడ్డ దుకాణాలు



**గజ్వేల్,ఏప్రిల్6 :** గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. ఆర్టీసీ బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బంద్ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కు దాడుల సమాచారం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు హామీలపై దృష్టి సారించాలని సూచించారు. హామీలను మరిచి ప్రతిపక్షాలపై దాడులు చేయడమేంటని వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా వారి ఆఫీసుల్లో మోదీ ఫొటో పెట్టారా అని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యేల ఆఫీసుల్లోనూ సీఎం ఫొటో పెట్టిస్తారా అని ప్రశ్నించారు. గజ్వేల్ ఎమ్మెల్యే అధికార కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణుల పిలుపు మేరకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. గజ్వేల్ బంద్‌లో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారిపై అత్యాచార యత్నం

## ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. సకాలంలో అడ్డుకున్న వ్యక్తికి సన్మానం

**హైదరాబాద్,ఏప్రిల్ 6 :** మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకూ కామాంధులు ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదు. ప్రాణాలు తీసైనా సరే అత్యాచారాలకు తెగిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నారులపైనా అఘాయిత్యాలు ఆగడం లేదు. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్ మహానగరంలో చోటు చేసుకుంది. చిన్నారిని కిడ్నాప్ చేసి అత్యాచారయత్నం చేశాడు ఓ కామాంధుడు. గోల్కొండ ప్రాంతంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు విద్యార్థిని(8) ఆటో ఎక్కింది. ఆమెకు మాయమాటలు చెప్పిన ఆటో డ్రైవర్.. గోల్కొండలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి ఏడుపు గమనించిన యువకుడు మహ్మద్ ఫిరోజ్ అప్రమత్తమై ఆటో వద్దకు వెళ్లారు. కామాంధుడి నుంచి బాలికను కాపాడారు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. స్కూల్ ఐడీ కార్డు ద్వారా విద్యార్థిని తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు ఫిరోజ్. అక్కడికి చేరుకున్న పోలీసులు బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని సలీంగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఆటోను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ సీపీ సజ్జనార్ ధైర్యసాహసాలు ప్రదర్శించి చిన్నారిని కాపాడిన ఫిరోజ్‌ను సన్మానించారు. వేగంగా స్పందించిన కానిస్టేబుళ్లు సాయికృష్ణ, కేదార్ సింగ్‌ను అభినందించారు.

# ఆదిగాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

మొదటి పేజీ తరువాయి



తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్భంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

**225 కోట్లతో అధునాతనంగా పునర్నిర్మాణం**

**ఆధునీకరణ పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన**

**ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ**

**మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం**



**నిర్మల్,ఏప్రిల్6 :** నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారని ప్రశస్తి. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది. జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజగోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.. గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్‌ఎ÷-లాన్‌లో భాగంగా చేపట్ట నున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# హామీలను అమలు చేసిన ఘనత మాది

## పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం

## మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క

**ఆదిలాబాద్,ఏప్రిల్6 :** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగుతున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.



# సర్కార్ భూములపై కాంగ్రెస్ గద్దలు!

**ఫ్రూట్ మార్కెట్ భూమిపై రేవంత్ కన్ను**

**నాడు కేసీఆర్ ప్రభుత్వం ఈ మార్కెట్కు భూములు కేటాయించింది**

**ఇప్పుడు రూ.3 వేల కోట్ల విలువైన 200 ఎకరాలు ప్రైవేటుకు దోచిపెట్టేందుకు యత్నం**

**కోహెడ పండ్ల మార్కెటు తరలించేందుకు కుయుక్తులు**

**తరలించాలని చూస్తే సహించేది లేదు**

**కోహెడ పండ్ల మార్కెట్లో మీడియాతో హరీష్ రావు**



**హైదరాబాద్ :** భూములను తన్నుకుపోయేందుకు గద్దల్లా తిరుగుతున్న కాంగ్రెస్ పాలకులను రైతాంగ పోరాటాలు చుట్టుముట్టక తప్పవని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీష్ రావు హెచ్చరించారు. అంగుళం భూమి కనిపించినా ఆక్రమించుకునేందుకు సిద్ధమవుతున్న రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజల్లో దోషిగా నిలబడే ఘడియలు ఆసన్నమవుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడ పండ్ల మార్కెట్ను తీర్చి దిద్దేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు కేటాయించి నిధులు సమకూ రిస్తే రేవంత్ రెడ్డి తన సొంత ఖజానా నింపుకోవడానికి భూ ఆక్రమణలకు పాల్పడుతూ మార్కెట్ను తరలిం చేందుకు కుట్ర చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శాసనసభ్యుల బృందంతో కలిసి సోమ వారం కోహెడ పండ్ల మార్కెట్ను హరీష్ రావు సంద ర్శించి రైతుల గోడు విన్నారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ లక్షలాది మంది రైతులకు ప్రయో జనం కల్పించి ఉపాధి అవకాశాలను మెరుకు పర్చేకోహెడ పండ్ల మార్కెట్ తరలించి భూములు ఆక్ర మించాలని కాంగ్రెస్ పాలకులు పన్నిన కుట్రకు రైతాం గ పోరాటాలు గుణపాఠం నేర్పుతాయని హెచ్చ రించారు. కొంతమంది దళారులకోసం కోహె డ మార్కెట్ భూములను పాలకులు ఆక్రమించేందు కు ప్రయత్నిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా రైతుల కోసం పనిచేయాలే కానీ దళా రుల కోసం కాదని చెప్పారు. వ్యవసాయ మంత్రి తక్ష ణం స్పందించి రైతులకోసం మార్కెట్ తరలింపు చర్యలను ప్రభుత్వం విరమించే విధంగా కృషిచేయా లని కోరారు. లక్షల మంది రైతుల సంక్షేమం కోసం ఆలోచించాలే కానీ నలుగురు దళారులకోసం ఆలో 'చించవద్దని ఆయన వ్యవసాయ మంత్రికి సూచించారు.

### రూ. వేయి కోట్లతో డీపీఆర్

గడ్డిఅన్నారం ఫ్రూట్ ఫ్రూట్ మార్కెట్లో మార్కెట్లో ట్రాఫిక్ ట్రాఫిక్ తగ్గించ దానికి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 200 ఎకరాల్లో కోహెడ మార్కెట్ను నిర్మించేందుకు నాటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని హరీష్ రావు గుర్తుచేశారు. తాను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉ న్నపుడు మంచిరెడ్డి కిషన్రెడ్డి తనతో కొట్లాడి రూ.10 కోట్లను ఫ్రూట్ మార్కెట్ కోసం చేసిన భూసే కరణలో భాగంగా ఇక్కడ రైతులకు ఇప్పించారనిచెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఫ్రూట్ మార్కెట్ నిర్మించాలని గత కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2020లో జీఓ 11 ద్వారా ఈ మార్కెట్ను నోటిఫై చేసినట్లు తెలిపారు. జీఓ 216 మేరకు రూ.350 కోట్ల డబ్బులను మార్కెట్ కోసం బ్యాంక్ అకౌంట్లో జమచేసినట్లు వివరించారు. రూ.1,000కోట్లతో డీపీఆర్ రూపొందించి భవిష్యత్ లో అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు, దిగుమ తులకు అవకాశాలు కల్పిస్తూ ఫ్రూట్స్, పూల మార్కె ట్లను తీసుకువచ్చేందుకు ప్రయత్నించినట్లు తెలి పారు.

వందసంవత్సరాల భవిష్యత్తు దృష్టిలో పెట్టు కుని ఫ్రూట్ మార్కెట్, పూల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు కృషిచేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుత మార్కెట్ విలువ మేరకు ఇక్కడి భూముల విలువ రూ. 3వేల కోట్లకు చేరుకోవడంతో భూములను తన్నుకుపోయేందుకు కాంగ్రెస్ పాలకులు గద్దల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి భూము లను రేవంత్ రెడ్డి సర్కార్ దళారులకు అప్పగించి రియలెస్టేట్ దందా చేసేందుకు మార్కెట్ ను డిల్ భూములకు తరలించేందుకు ప్రయత్నిస్తు నారని విచారం వ్యక్తంచేశారు. డిల్ భూముల జోలికి వెళ్లా ద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ భూ ఆక్ష మణ దారులు రైతులను భయ భ్రాంతులకు గురిచేస్తు న్నారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికే కోటీ ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చి కాంగ్రెస్ పాలకులు రియలెస్టేట్ దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు.



# బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

### మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ

**హైదరాబాద్,ఏప్రిల్ 6 :** ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందుకు తగినట్లుగా వ్యూహాలు రచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సింగరేణి కార్మికులతో భేటీ అవ్వగా తాజాగా సోమవారం బంజారా నేతలను కలిశారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత మర్యాద పూర్వకంగా వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కవిత వారిని కోరారు. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే దానిపై వారితో కూలంకషంగా ఆమె చర్చించారు. ఆ సామాజిక వర్గానికి ఏం చేయాలో అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలో వారికి సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంజారా ప్రముఖులంతా తాము ఏర్పాటు చేయబోయే పార్టీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారిని తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

# అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులు

### వెంటనే వారిని ఆదుకోవాలన్న మాజీమంత్రి వేముల

**నిజామాబాద్,ఏప్రిల్ 6 :** అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. వరి, అరటి, మామిడి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నా.. ఎక్కడా అలాంటి కార్యక్రమాలు లేవని విమర్శించారు. వర్షాలకాలంలో సైతం పంట నష్టం జరిగినా, వివరాలు సేకరించినా ఇంతవరకూ ఒక్క రూపాయి కేటాయించలేదని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టం జరిగినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వడగండ్ల వాన కారణంగా తీవ్రంగా పంట నష్టం జరిగినా, ఇప్పటి వరకు కలెక్టర్ గాని, సంబంధిత అధికారులు గాని స్పందించలేకపోయారని పేర్కొన్నారు. వెంటనే స్పందించి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఇటీవల వడగండ్ల వానకు జిల్లాలోని సాలూరా, ధర్పల్లి, నిజామాబాద్ రూరల్, సిరికొండ, కామారెడ్డి జిల్లా బీర్కూర్ తదితర మండలాల్లో వరి, మక్కజొన్న, అరటి పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కూరగాయలు దెబ్బతినగా, మామిడి కాయలు రాలిపోయాయి. సాలూరా మండలంలోని ఖాజాపూర్, హున్సా, మందర్న, ధర్పల్లి మండలంలోని ప్రాజెక్టు రామడ్గు, దమ్మన్నపేట్, గోవింద్‌పల్లి, కేశారం, ధర్పల్లి, బెలియతండా, సిరికొండ మండలంలోని తాటిపల్లి, పెద్దవాల్గోట్, పందిమడుగు, కొండూర్, చీమన్‌పల్లీ, జినిగ్యాల తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిని రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంట కండ్ల ముందే రాలిపోతుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ఇందల్వాయి రోడ్డు, దమ్మన్నపేట్ రోడ్డులో అడ్డంగా చెట్లు నేలకూలాయి. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవనగర్‌లో రామసాని కామయ్యకు చెందిన ఐదు గేదెలు విద్యు త్‌షాక్‌తో మృత్యువాత పడ్డాయి. ఈదురుగాలులకు ఓ చెట్టు కూలి విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో స్తంభం విరిగి విద్యుత్ తీగలు తెగి ఇంటి వద్ద కట్టేసి ఉంచిన ఐదు గేదెలపై పడడంతో అవి అక్కడికక్కడే మృతిచెందాయి.

# ఆరు గ్యారెంటీలపై గ్రామాలకు వెళితే తెలుస్తుంది

### ఏ మేరకు అమలు చేశారు ప్రజలను అడగండి

### కేరళకు వెళ్లి అబద్దాలు ప్రచారం చేయడం కాదు

### మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు

**నల్లగొండ,ఏప్రిల్6 :** కేరళం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి గొప్పలు చెప్పడం తప్ప, అక్కడ రేవంత్‌ను చూసి ఓటేసేదెవరిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలయ్యాయని నిరూపించగలరా అని సవాల్ చేశారు. శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు ప్రజలకు ఇచ్చిన హామీలపై సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. సీఎం స్థాయిని రేవంత్‌రెడ్డి దిగదార్చేలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తును అభాసుపాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ఎక్కవ కాలం ప్రజల్లో నిలువలేరని అన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి రేవంత్ మన పరువు తీస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో తిరిగి తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రజలను అడిగితే చెబుతారని అన్నారు. ప్రధాన అంశాలైన గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ పద్దులపై చర్చలు నడుస్తున్న సమయంలో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారానికి వెళ్లాడని వివరించారు. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు ఆఫీసుపై చేసిన దాడి ప్రభుత్వ కార్యాలయంపై దాడేనన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్‌పై బురజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ మంత్రి పార్లమెంట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై నెగెటివ్‌గా మాట్లాడారని, ఆయనకు తన శాఖపై పూర్తి అవగాహన లేదన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉ న్నాడో ఆ నియోజకవర్గ ప్రజలతో రెఫరెండం పెట్టిస్తే తెలుస్తుందన్నారు. బయటకు వస్తే కాంగ్రెస్ అంటూ, విచారణ జరిపితే ఎమ్మెల్యే పదవి పోతుందని బీఆర్ఎస్‌లో ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం ఊసరవెల్లి రాజకీయాన్ని తలపిస్తున్న దన్నారు. మేడారం జాతరలో నాసిరకం పనులు చేయడంతోనే రెండు టన్నుల బండరాయి బాలుడి కాలుపై పడి తీవ్ర గాయాలవడంతో వైద్యులు ఆపరేషన్ చేసి కాలు తొలగించారని అన్నారు. ప్రమాదాలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో భూగర్భ జలాలు సమృద్ధి ఉంటే కాంగ్రెస్ పాలనలో అడుగంటుతున్నాయని, దీంతో వ్యవసాయ బావుల్లో రైతులు పూడిక తీస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలన కాదని, ప్రజాపీడిత పాలన అని ఆయన ఆరోపించారు. తెలంగాణలో ఫ్యాక్ష న్ రాజకీయాలు, దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్పడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే దిక్కుతోచని స్థితిలో కాంగ్రె స్ దాడులకు తెగబడుతున్నదన్నారు. హామీలు మరిచి దాడులతో డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ఆరోపించారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేసే వారికి ఎలా బుద్ది చెప్పాలో తెలంగాణ ప్రజానికానికి తెలుసని ఆయన పేర్కొన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం

### సెక్యూరిటీని ఛేదించుకుని దూసుకు వచ్చిన కారు

### కారును స్వాధానం చేసుకుని, డ్రైవర్ అరెస్ట్

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 6 :** ఢిల్లీ అసెంబ్లీ వద్ద సోమవారంనాడు కీలకమైన భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. సెక్యూరిటీని ఛేదించుకుని ఓ కారు దూసుకు వచ్చింది. ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక వాహనం బలవంతంగా అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టినట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటన సంచలనం సృష్టించగా, ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గేట్ నెంబర్ 2 వద్దనున్న ఇనుప బ్యారియన్‌ను ఛేదించుకుంటూ ఒక వాహనం అసెంబ్లీ ఆవరణలోకి అడుగుపెట్టింది. వాహనం డ్రైవరు స్పీకర్ విజేందర్ గుప్తా కార్యాలయం వైపు దూసుకుపోయాడు. కార్యాలయం ముందు ఫ్లవర్ బోకే ఉంచడంతో పాటు స్పీకర్ కారుపై ఇంకు చల్లినట్టు గుర్తించారు. ఘటన అనంతరం వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది. హైసెక్యూరిటీ జోన్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడం భద్రతా ఆందోళనలను మరింత పెంచినట్టు చెబుతున్నారు. ఈ ఘటనపై అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు వెంటనే విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కారును స్వాధీనం చేసుకున్నారు. కాగా, అసెంబ్లీ ప్రాంగణంలో ఉంచిన పుష్పగుచ్ఛంలో ఎలాంటి బాంబు లేదని పోలీసులు తేల్చారు. ప్రస్తుతం సీసీటీవీ ఫుటేజ్‌ను స్కానింగ్ చేసి వాహనం డ్రైవరు ఈ ఘటనకు పాల్పడడానికి కారణంపై విచారణ జరుపుతున్నారు. ఇటీవల ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలోనూ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. తాజా ఘటనతో హైసెక్యూరిటీ జోన్‌లో భద్రతా ఉల్లంఘనలు మరింత అందోళనలను కలిగిస్తున్నాయి.

# పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం

### భారత ప్రభుత్వం కీలక నిర్ణయం

### థార్ ఎడారిలో ముడిచమురు ఉత్పత్తి పెంపు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 6 :** అమెరికా-ఇరాన్ యుద్ధ సమయం వల్ల చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు పెట్రోల్, డీజిల్ కోసం అల్లాడుతున్నాయి. మన దేశంపై పెద్దగా ప్రభావం లేకున్నా, దీర్ఘకాలం ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే మాత్రం భారత్ కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఈ నేపథ్యంలోనే భారత్ తన 'థార్' ప్రణాళికను అమలు చేస్తోంది. థార్ ఎడారి ప్రాంతంలో ఉన్న చమురు క్షేత్రాల నుంచి ముడి చమురు ఉత్పత్తిని పెంచింది. రికార్డ్ స్థాయిలో 1202 బ్యారెళ్ల ముడి చమురును జోధ్ పూర్ ఆయిల్ ఫీల్డ్స్ నుంచి ఉత్పత్తి చేస్తోంది. గతేడాది ఇక్కడి నుంచి రోజుకు 705 బ్యారెళ్ల ఉత్పత్తి మాత్రమే జరిగేది. ఈ సంక్షోభం నేపథ్యంలో గతేడాది కన్నా 70 శాతం అధిక చమురు ఉత్పత్తిని పెంచింది. ఆయిల్ ఇండియా, జైసల్మేర్‌లోని బఘేవాలా చమురు క్షేత్రం నుండి ముడి చమురును ట్యాంకర్ల ద్వారా గుజరాత్‌లోని మెహసానాలో ఉన్న ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ ప్లాంట్లకు రవాణా చేస్తుంది. అక్కడి నుండి, ఆ ముడి చమురును పైప్‌లైన్ ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న కోయాలి రిఫైనరీకి రవాణా చేస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆయిల్ ఇండియా తన రాజస్థాన్ ఫీల్డ్ నుంచి 43,773 మెట్రిక్ టన్నుల ముడి చమురును ఉత్పత్తి చేసింది. ఈ ఏడాది 32,787 మెట్రిక్ టన్నుల కన్నా ఎక్కువ ఉత్పత్తి చేస్తోంది. థార్ ఎడారిలోని చమురు ఈ సమయంలో కీలకంగా మారుతోంది. బికనేర్-నాగౌర్ సబ్ బేసిన్‌లో ఉన్న బఘేవాలా చమురు క్షేత్రం భారతదేశంలోని కొన్ని చమురు క్షేత్రాల్లో ఒకటి. ఆయిల్ ఇండియా 19 బావులలో సీఎస్ఎస్ కార్యకలాపాలను పూర్తి చేసింది. ఇది గతేడాదితో పోలిస్తే సుమారుగా 72 శాతం పెరుగుదల. 1991లో ఈ ప్రాంతంలో చమురును గుర్తించారు. 200.26 చదరపు కి.మీ విస్తీర్ణంలోని థార్ చమురు క్షేత్రంలో 52 బావులు ఉండగా, 33 పనిచేస్తున్నాయి. ఆయిల్ ఇండియా 2018లో తొలిసారిగా సీఎస్ఎస్ టెక్నాలజీని ప్రారంభించింది. ఈ క్షేత్రం నుంచి భారీ స్థాయిలో వెలికితీతకు వీలవుతుంది.

# నటి సుభాషిణి ఆత్మహత్య

### భర్తను అరెస్ట్ చేసిన పోలీసులు

**చెన్నై,ఏప్రిల్ 6 :** చెన్నై నగరంలోని పోరూరులో నటి సుభాషిణి ఆత్మహత్య చేసుకుంది. అపార్ట్‌మెంట్‌లోని తన నివాసంలో సోమవారం ఆమె ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుభాషిణి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ వివాదాలే ఈ ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు సుభాషిణి తన భర్తకు వీడియో కాల్ చేసినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం.. తన గదిలోకి వెళ్లి సుభాషిణి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. టీవీ సీరియల్‌తోపాటు పలు చిత్రాల్లో సుభాషిణి హీరోయిన్‌గా నటించారు. షూటింగ్‌ల కోసం సుభాషిణి చెన్నైలో ఒంటరిగా నివసిస్తున్నట్లు తెలుస్తోంది. సుభాషిణి మృతిపై ఆమె భర్తకు సమాచారం అందించారు. అతడిని సైతం పోలీసులు విచారిస్తున్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ

### నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల పక్రియ

### సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక

**హైదరాబాద్,ఏప్రిల్ 6 :** జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల పక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల పక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూట్నీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టు ఆన్‌లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రిడేషన్ జారీ పక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్‌లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

# 9మంది పోలీసులకు ఉరిశిక్ష

## తమిళనాడులోని సాతన్ కుళం లాకప్‌డెత్ కేసు

**మధురై సెషన్స్ కోర్టు సంచలన తీర్పు**
**కరోనా సమయంలో పోలీసుల వేధింపులు**
**చిత్రహింసలతో తండ్రీకొడుకుల మృతి**
**సుమోటోగా కేసు నమోదు.. విచారణ..**
**ఆరేళ్ల తర్వాత నిందితులకు శిక్ష ఖరారు**



**చెన్నై :** లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

# చంద్రుడి కక్ష్యలోకి ఆర్టెర్‌మిస్-2 మిషన్

## నేటి తెల్లవారు జామున చేరుకునే ఛాన్స్

**వాషింగ్టన్ :** చంద్రుడిని చుట్టి వచ్చేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెర్‌మిస్-2 మిషన్ మరి కొన్ని గంటల్లో సరికొత్త రికార్డు నెలకొల్పనుంది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములతో కూడిన ఒరాయన్ వ్యోమనౌక ఇప్పటికే చంద్రుడి గురుత్వాకర్షణ ప్రభావం పరిధిలోకి వెళ్లింది. ఈస్టర్న్ డేలైట్ టైమ్ అమెరికా కాలమానం ప్రకారం, 6న సాయంత్రం 7.07 గంటలకు భూమి నుంచి గరిష్ఠంగా 252,757 మైళ్ల దూరానికి వ్యోమనౌక చేరుకుంటుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున సుమారు 4.35 గంటల సమయంలో వ్యోమనౌక ఈ గరిష్ఠ దూరానికి చేరుకుంటుంది. దీంతో, ఇది భూమ్మీద నుంచి అత్యధిక దూరానికి చేరిన మానవసహిత యాత్రగా నిలిచిపోతుంది. 1970లో నాసా చేపట్టిన అపోలో-13 మిషన్ కంటే 4,102 మైళ్ల అధిక దూరానికి ఒరాయన్ నౌక చేరుకుంటుంది. ఈ మిషన్‌లో భాగంగా నాసా ఆస్ట్రోనాట్స్ రీడ్ వైస్‌మెన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టీనాతో పాటు కెనడా వ్యోమగామి జెరెమీ హాన్సన్ చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఫొటోలు తీయనున్నారు. సాధారణంగా జాబిల్లికి చెందిన ఒకవైపు మాత్రమే భూమ్మీద నుంచి కనిపిస్తుంది. భూమ్మీద నుంచి చూడటం సాధ్యం కాని రెండో వైపును ఫార్ సైడ్ అని శాస్త్రవేత్తలు పిలుస్తారు. తాజా మిషన్‌లో ఆస్ట్రోనాట్స్ ఫార్ సైడ్‌న ఉన్న ఉపరితలాన్ని ఫొటోలు తీయనున్నారు. చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఉపరితలానికి 4 వేల మైళ్ల ఎత్తునుంచి ఈ ఫొటోలు తీసుకున్న అనంతరం భూమివైపు తిరుగుప్రయాణం అవుతారు. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున ఈ÷÷-లైబై పక్రియ ప్రారంభం అవుతుంది. మిషన్ అనంతరం ఏప్రిల్ 10న వ్యోమగాములు భూమికి చేరుకుంటారు.

# ఓటర్ జాబితా అప్‌డేట్‌కు గడువు

## సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ ఓటరు లిస్ట్ అప్‌డేట్‌కు సుప్రీం కోర్టు ఒకరోజు గడువు విధించింది. రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పునఃపరిశీలించాలని ప్రత్యేక విస్తృత పునర్విచారణ ట్రైబ్యునల్స్‌ను ఆదేశించింది. ఓటరు లిస్ట్ నుంచి పేర్లను తొలగించడానికి న్యాయాధికారులు ఇచ్చిన కారణాలతో సహా మొత్తం పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను నిర్ణయించేందుకు ట్రైబ్యునళ్లు అనుసరించాల్సిన విధానాలను సూచించేందుకు.. ముగ్గురు మాజీ న్యాయమూర్తులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంఆదేశించింది. ట్రైబ్యునల్స్ పనితీరుకు సంబంధించిన పరిపాలనాపరమైన అంశాలనూ పర్యవేక్షించాలని సూచించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ తమ అప్పీళ్లను దాఖలు చేయడానికి వీలుగా రసీదులు జారీ చేయాలని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని ఆదేశించింది. మరోవైపు ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి 19 అప్పిలేట్ ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేసినట్లు సుప్రీం కోర్టుకు ఎన్నికల సంఘం తెలియజేసింది

# బెంగాల్ ప్రచారంలోకి లియాండ్ర్ పేస్

## ఎక్స్ కేటగిరి భద్రత కల్పించిన కేంద్రం

**న్యూఢిల్లీ:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇటీవల బీజేపీలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్‌కు కేంద్ర హోం శాఖ 'ఎక్స్' కేటగిరీ భద్రత కల్పించింది. ఇందులో భాగంగా సీఐఎస్ఎఫ్ సిబ్బందిని ఆయన భద్రత కోసం కేటాయించింది. పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించేందుకు లియాండర్ పేస్ సిద్ధపడుతుండటంతో కేంద్ర హోంశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. యాభై రెండేళ్ల లియాండర్ పేస్ గత వారం బీజేపీలో చేరారు. తాను లాంఛనపూర్వకంగా పార్టీలో చేరలేదని, ఒక బాధ్యతతో, దేశానికి సేవచేసే లక్ష్యంతో బీజేపీలో చేరినట్టు చెప్పారు. బీజేపీలో చేరడానికి ముందు మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ తరఫున గత ఎన్నికల్లో ఆయన ప్రచారం చేశారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం సాగించే స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో లియాండర్ పేస్‌ను కూడా బీజేపీ చేర్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, మిథున్ చక్రవర్తి, కంగానా రనౌత్ తదితరులు కూడా పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారంలో ఉన్నారు. కాగా, బెంగాల్‌కు రెండు దఫాలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ఒక్కరోజులో అంతు తేలుస్తాం

**ఇరాన్‌ను మట్టుబెట్టేస్తాం**
**అది ఈ రోజు రాత్రే కావొచ్చు**
**నేను చాలా నిరాశకు గురయ్యాను**
**టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు**
**మా పైలట్ను రక్షించుకోగలిగాం**
**రెస్క్యూ గురించి ఇరాన్‌కు ముందే తెలిసింది**
**ఎవరో లీక్ చేశారు.. అతడికి శిక్ష తప్పదు**
**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



**వాషింగ్టన్:** ఇరాన్‌ను ఒక రాత్రిలో నిర్మూలించవచ్చని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అది మంగళవారం సాయంత్రం నాటికి జరగవచ్చని సూచించారు. ఇరాన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై బాంబు దాడికి మంగళవారం గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యం లో ఆయన సోమవారం వైటాస్లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మొత్తం దేశాన్ని ఒక్క రాత్రిలో నాశనం చేయవ ఒక్క రాత్రిలో చ్చు. ఆ రాత్రి రేపు రాత్రి కావచ్చు అని అన్నారు. అమెరికా కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించి, పాకిస్తాన్ ద్వారా తన ప్రతిస్పందనను పంపిన కొన్ని గంటల తరువాత అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు వెలువడ్డాయి. తాత్కాలిక కాల్పుల విరమణకు బదులుగా టెహ్రాన్ 10 సూత్రాల ప్రణాళికను రూపొందించింది. లెబనాన్, గాజాతో సహాయుద్ధానికి శాశ్వత ముగింపు పలకాలని, తిరిగి యుద్ధం తలెత్తదని హామీ ఇవ్వాలని ఆ ప్రణాళికలో కోరారు. ఈ ప్రతిపాదనలో హార్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణను గుర్తించడం, ఆంక్షలను ఎత్తివేయడం, ఎన్పీటీ కింద ఇరాన్ అణుహక్కులను అధికారికంగా అంగీకరించడం, యుద్ధం వల్ల కలిగిన ఆర్థిక నష్టానికి పరిహారం చెల్లించడం వంటివి కూడా ఉన్నాయి. దీనిపై ట్రంప్ స్పందిస్తూ టెహ్రాన్ పూర్తిగా నాశనమవుతున్నందు న కాల్పుల విరమణ కోరుకుంటోందని, యుద్ధాన్ని ముగించడానికి తాను ఇరాసు అవకాశాలు ఇచ్చానని, కానీ వారు వాటిని ఉపయోగించుకోలేద ని అన్నారు. కాల్పుల విరమణను ఏర్పాటు చేయబో"యేది నేను మాత్రమే అని ఆయన అన్నారు. అందువల్ల ఏ కాల్పుల విరమణను ఏర్పాటు చేయలేదు అని అన్నారు. ఇరాన్పై తాను చాలా కలత చెందానని ట్రంప్ అన్నారు. ఒకవేళ ఒప్పందానికి రాకపోతే టెహ్రాన్ భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. వీరోచిత రెస్క్యూ ఆపరేషన్కు 155 విమానాలు మొదటి అమెరికన్ వైమానికాధికారిని రక్షించిన కొన్ని రోజుల తరువాత కూడా ఇరాన్ లో చిక్కుకుపో యిన రెండవ వ్యక్తిని తిరిగి తీసుకురావడానికి చేపట్టిన రెస్క్యూ మిషన్లో 155 విమానాలు పాల్గొన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. భారత కాలమాన ప్రకారం సోమవారం రాత్రి 10.30 గంటలకు వైటాస్లో నిర్వహించిన ప్రెస్మీట్లో ఆయన మాట్లాడుతూ రెస్క్యూ మిషన్లో నాలుగు బాంబర్లు, 64 ఫైటర్లు, 48 ఇంధనం నింపే ట్యాంకర్లు, 13 రెస్క్యూ విమానాలతో సహా మొత్తం 155 విమానాలు పాల్గొన్నట్లు తెలిపారు. మేము వాటన్నింటిని అక్కడికి తీసుకొచ్చాం. అందులో చాలా వరకు మాయోపాయమే. అతను వేరే ప్రదేశంలో ఉన్నాడని వారు భావించేలా చేయాలను కున్నాం. అక్కడ వారికి భారీ సైనిక బలం ఉంది. వేలాది మంది వెతుకుతున్నారు అని ట్రంప్ అన్నారు. ఆ వీరోచిత అధికారి ఇరాన్లో దాదాపు 48 గంటల పాటు నేలపై పట్టుబడకుండా తప్పించుకున్నారని అన్నారు. అమెరికా దళాలు ఇరాన్ లో విమానాలను వదలి వేయవలసి వచ్చింది. కానీ ఆ విమానాల్లో పరికరాలను ఇరాన్ చేజిక్కించుకోకుండా ఉండేందుకు, అమెరికా సైన్యం వాటిని ముక్కముక్కలుగా పేల్చివేసిందని అన్నారు.

# బెదిరింపులకు తలొగ్గం

**హోర్ముజ్ ను తెరవం!.. కాల్పుల విరమణపై ఇరాన్**
**పాకిస్తాన్ ప్రతిపాదనను అందుకున్న యూఎస్, టెహ్రాన్**
**10 సూత్రాలను ప్రతిపాదించిన ఇరాన్**

**టెహ్రాన్:** కాల్పుల విరమణ వంటి తాత్కాలిక ఒప్పందాలు పని చేయబోవని, యుద్ధానికి శాశ్వతంగా తెరదించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. పాకిస్తాన్ ద్వారా అమెరికా పంపిన 45 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాద నను పూర్తిగా తిరస్కరించింది. యుద్ధానికి శాశ్వతంగా ముగింపు చెప్పడంతో సహా 10 డిమాండ్లను ముందుకు తెచ్చింది. అప్పుడు మాత్రమే హోర్ముజ్ను తెరుస్తామని స్పష్టం చేసింది. హోర్ముజ్పై తమకే నియంత్రణ ఉండాలని కుండబద్దలు కొట్టింది. యుద్ధంలో జరిగిన నష్టానికి పరిహా రం కావాలని డిమాండ్ చేసింది. ఇరాన్ చేసిన ప్రతిపా దనలను ఆ దేశ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ వెల్లడిం చింది. అంతకు ముందు ట్రంప్ మాట్లాడుతూ 45 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను అమెరికా సమీక్షించింద ని, ఇది సరిపోకపోయినా ఒక ముందడుగు అని వైటాస్లో విలేకరులతో అన్నారు. మధ్యవర్తులు చర్చలు కొనసాగిస్తు న్నారని తెలిపారు.

**ఇరాన్ ప్రతిపాదించిన 10 షరతులు**

- యుద్ధానికి శాశ్వత ముగింపు: అమెరికా, ఇజ్రాయేల్లు చేపట్టే అన్ని సైనిక చర్యలకు తక్షణమే ముగింపు పలకాలి.
- తాత్కాలిక కాల్పుల విరమణతో పని లేదు: తుది వరకు కట్టుబడి ఉండే శాంతి ఒప్పందం మాత్రమే ఆమోదయోగ్యం.
- మా మిత్ర దేశాలతో యుద్ధం చేయరాదు: లెబనాన్, సిరి యా, ఇరాక్తో పాటు ఈ ప్రాంతంలో ఇరాన్తో సంబంధం ఉన్న గ్రూపుల మధ్య ఘర్షణలకు ముగింపు పలకాలి.
- భవిష్యత్తులో దాడి చేయబోమని హామీ ఇవ్వాలి: భవిష్యత్తులో దాడులు, లేదా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకునే కార్యకలాపాలను నిరోధించడానికి కట్టుబడి ఉండే అంతర్జాతీయ హామీ.
- ఆ హార్ముజ్పై జలసంధిపై మా ఆధిపత్యాన్ని గుర్తించాలి: ఈ జలమార్గంపై ఇరాన్ వ్యూహాత్మక పాత్ర, నియంత్రణ పట్ల ఉన్న ఆందోళనలను గుర్తించాలి. సురక్షితమైన సముద్ర ప్రయాణానికి భరోసా ఇచ్చే విధంగా ఒప్పందం ఉండాలి.
- ఆంక్షలు ఎత్తివేయాలి: ఇరాన్పై అమెరికా విధించిన ఆంక్షలు, అంతర్జాతీయ ఆర్థిక ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలి.
- స్తంభింప చేసిన ఆస్తులను విడుదల చేయాలి: విదేశాలలో ఉన్న ఇరాన్ ఆస్తులను తక్షణమే విడుదల చేయాలి.
- యుద్ధ నష్టపరిహారం/పునర్నిర్మాణం: యుద్ధం సమయంలో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునర్నిర్మించడానికి నష్టపరిహారంతో పాటు అంతర్జాతీయ సహకారం అందించాలి.
- సార్వభౌమాధికారానికి గుర్తించాలి: ఇరాన్ ప్రాదేశిక -సమగ్రత, రాజకీయ సార్వభౌమాధికారాన్ని అధికారికంగా గుర్తించాలి. పరాయి దేశాలు జోక్యం చేసుకోకుండా హామీ ఇవ్వాలి.
- ఆ నిర్మాణాత్మక శాంతి యంత్రాంగం: తదుపరి చర్చలు, పర్యవేక్షణ యంత్రాంగాలతో సహా దీర్ఘకాలిక శాంతి కోసం ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలి.

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు




**అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం**
**పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని భావించారని, కానీ రద్దు చేసి చూపించామని అన్నారు. అలాగే, ఎన్డీయే కూటమి కూడా 25 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

# ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ

## దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖాదేమీ మృతి

**టెహ్రాన్ :** ట్రంప్ బెదిరింపుల వేళ ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ తగిలింది. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖాదేమీ మరణించారు. ఈ విషయాన్ని ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. అయితే ఆయన ఎక్కడ హతమయ్యాడనేది వెల్లడించలేదు. టెహ్రాన్‌లోని నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సోమవారం ఉదయం ఈ దాడులు చోటుచేసుకున్నాయి. అమెరికన్-జియోనిస్ట్ శత్రువు తెల్లవారుజామున జరిపిన క్రిమినల్ టెర్రరిస్ట్ దాడిలో తమ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ మజీద్ ఖాదేమీ మరణించారని, ఆయన తన ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక వ్యక్తి అని ఐఆర్‌జీసీ వెల్లడించింది. గత ఏడాది జూన్ 12న ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో జనరల్ మమహ్మద్ కజేమీ మరణించడంతో ఆయన స్థానంలో మజీద్ ఖాదేమీ బాధ్యతలు చేపట్టారు. ఇజ్రాయెల్-అమెరికా సోమవారంనాడు జరిపిన భారీ దాడుల్లో 25 మందికి పైగా మరణించారు. ప్రతిగా ఇజ్రాయెల్, గల్ఫ్ అరబ్ పొరుగుదేశాలపై ఇరాన్ క్షిపణి దాడులు జరిపింది. ఫిబ్రవరి 28 ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు ప్రారంభించడంతో ఆ దాడుల్లో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. అనంతరం ఇరాన్ అత్యున్నత భద్రతాధికారి అలీ లారీజాన్ మరణం ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ అయింది. మార్చి 17న నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్, ఆయన కుటుంబ సభ్యులను అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త బలగాలు మట్టుబెట్టాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తీవ్రమైంది. ఈనెల 6లోగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని, లేదంటే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. గడువు ముగుస్తుండటంతో ఇదే చివరి అవకాశం అంటూ ట్రంప్ మరో రోజు గడువును పొడిగిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు.



# మానసికంగా కుంగిపోయా

## రిటైర్మెంట్‌పై అశ్విన్ సెన్సేషనల్ కామెంట్స్!

చెన్నై సూపర్ కింగ్స్ మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ఐపీఎల్ రిటైర్మెంట్‌పై సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. 2025 ఐపీఎల్ సమయంలో తాను మానసికంగా అలసిపోయానని లేదంటే లీగ్‌లో మరికొంత కాలం ఆడి ఉండేవాడినని అశ్విన్ పేర్కొన్నాడు. తాజాగా చెన్నై– ఆర్సీబీ మధ్య జరిగిన మ్యాచ్‌ను తన యూట్యూబ్ ఛానెల్‌లో మాజీ క్రికెటర్ విమల్ కుమార్‌తో అశ్విన్ విశ్లేషించాడు. ఈ మేరకు ఈ వ్యాఖ్యలు చేశాడు.'నేను ఈ మ్యాచ్ (ఆర్సీబీ– సీఎస్కే)ను న్యూట్రల్ పాయింట్ ఆఫ్ ది వ్యూలోనే చూశాను. కానీ, ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. గత సీజన్ చెన్నైకి కలిసిరాలేదు. అది వ్యక్తిగతంగా నాకు కూడా తీవ్రంగా నిరాశ కలిగించింది. ఆ సమయంలో నేను ఇంకా మరిన్ని సీజన్లు ఆడగలను అనిపించింది. కానీ, నేను ఎమోషనల్‌గా అలసిపోయాను. అందుకే ఇకపై ఆడకూడదని నిర్ణయం తీసుకున్నాను' అని అన్నాడు. ఒకవేళ గత సీజన్ సీఎస్కేకు బాగా జరిగి ఉంటే ఈ సీజన్‌లో బరిలోకి దిగేవాడివా అని విమల్ అడిగాడు. దీనికి అశ్విన్, 'నేను ఆ విషయం గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అది మానసికంగా కలవరపెడుతుంది. నా పరంగా ఆ సీజన్ నన్ను బాగా నిరాశ పర్చింది. అందుకే ఇక ఆడకూడదు అనుకున్నా. దీనిపై నేను చర్చించుకున్నాను. అయితే నా ఐపీఎల్ కెరీర్ చెన్నైతోనే మొదలైంది. ఈ కెరీర్?ను నా సొంత సిటీలో చెన్నైతోనే ముగించాలనుకున్నా. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా' 'అలాగే నేను రిటైర్ అయిపోతే ఫ్రాంచైజీకి కూడా నా వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. నన్ను జట్టులో రిటైన్ చేసుకోవాలా? లేదా వదిలేయాలా అనే కన్‌ఫ్యూజన్ ఉండదు. నేను రిటైరైతే సీఎస్కేకు రూ.10 కోట్లు మిగులుతాయి. ఆ డబ్బుతో వేలంలో మరికొంతమంది ప్లేయర్లను కొనుగోలు చేసి జట్టును బలంగా చేసుకోవచ్చని ఆలోచించాను' అని అశ్విన్ తన రిటైర్మెంట్ వెనకున్న కారణాన్ని వెల్లడించాడు. కాగా, అశ్విన్ 2024లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. ఆ తర్వాత 2025 ఐపీఎల్‌లో సీఎస్కే తరఫున ఆడాడు. 2025 మెగా వేలంలో అశ్విన్‌ను చెన్నై రూ.9.75 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. ఆ సీజన్‌లో అశ్విన్‌కు తక్కువ అవకాశాలు లభించాయి. మొత్తం 14 మ్యాచ్‌ల్లో అశ్విన్ 9 మ్యాచ్‌ల్లోనే బరిలోకి దిగాడు. ఏడు వికెట్లు తీశాడు. ఇక అదే ఏడాది ఆగస్టులో ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించి షాకిచ్చాడు. ఇక అశ్విన్ 2009లో చెన్నై తరఫునే ఐపీఎల్ కెరీర్ ప్రారంభించాడు. కెరీర్ మొత్తంలోచెన్నై, పుణె, పంజాబ్, దిల్లీ, రాజస్థాన్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 17ఏళ్ల సుదీర్ఘ కెరీర్?లో అశ్విన్ మొత్తం 239 మ్యాచ్‌ల్లో 201 వికెట్లు పడగొట్టాడు. ఇక ప్రస్తుత సీజన్?లో చెన్నై సూపర్ కింగ్స్ ఇంకా పాయింట్ల ఖాతా తెరవలేదు. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?లు ఆడగా మూడింట్లోనూ సీఎస్కే ఓడిపోయింది. తొలుత రాజస్థాన్?తో మ్యాచ్?లో ఓటమి చెందగా, తర్వాత వరుసగా పంజాబ్ కింగ్స్, ఆర్సీబీ జట్లపై పరాజయం చవిచూసింది. దీంతో పాయింట్ల పట్టికలో సీఎస్కే 10వ స్థానానికి పడిపోయింది. ఇక ఏప్రిల్ 11 (శనివారం) చెన్నై నాలుగో మ్యాచ్ ఆడాల్సి ఉంది. సొంతగడ్డపై దిల్లీ క్యాపిటల్స్?తో సీఎస్కే ఆడనుంది. ఈ మ్యాచ్?లోనైనా విజయం సాధించి టోర్నీలో బోణీ కొట్టాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



# భువనేశ్వర్ కుమార్ సరికొత్త రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఒక అద్భుతమైన మైలురాయి నమోదైంది. 'స్వింగ్ కింగ్'గా పేరొందిన భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఆదివారం రాత్రి ఎం. చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ ఈ అరుదైన ఘనతను సాధించారు. ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్ల మార్కును అందుకున్న తొలి భారతీయ వేగవంతమైన బౌలర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హై–వోల్టేజ్ పోరులో భువనేశ్వర్ కుమార్ తన పాత ఫామ్‌ను గుర్తుకు తెచ్చారు. ఈ మ్యాచ్‌లో ఆయన 3 కీలక వికెట్లు పడగొట్టి చెన్నై బ్యాటింగ్ వెన్నెముకను విరిచారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో తన స్వింగ్‌తో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన భువీ, ఐపీఎల్‌లో తన 200వ వికెట్‌ను సాధించి స్టేడియంను హోరెత్తించారు. ఈ ఘనత సాధించిన సమయంలో మైదానంలోని ఆటగాళ్లు, ప్రేక్షకులు ఆయనకు ఘనంగా అభివాదం చేశారు. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 200 వికెట్ల మార్కును దాటిన బౌలర్లు చాలా తక్కువ మంది ఉన్నారు. యజువేంద్ర చహల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ ఇప్పుడు ఈ ఎలైట్ క్లబ్‌లో చేరారు. అయితే, ఒక పేసర్‌గా ఈ మైలురాయిని అందుకోవడం భువీకి దక్కిన ప్రత్యేక గౌరవం. గతంలో లసిత్ మలింగ (170) వంటి దిగ్గజ పేసర్లు కూడా ఈ మార్కును అందుకోలేకపోయారు. భువనేశ్వర్ కుమార్ కెరీర్‌లో మెజారిటీ భాగం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతోనే సాగింది. ఎన్నో ఏళ్లపాటు ఆ జట్టుకు ప్రధాన బౌలర్‌గా ఉండి, రెండుసార్లు 'పర్పుల్ క్యాప్' (అత్యధిక వికెట్లు తీసిన బౌలర్) గెలుచుకున్న ఏకైక భారతీయ బౌలర్‌గా నిలిచారు. 2026 మెగా వేలంలో ఆర్సీబీ ఆయనను సొంతం చేసుకోగా, కొత్త జట్టులో కూడా తన విలువేంటో భువీ నిరూపించుకున్నారు. ఈ అద్భుత ఘనతపై క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆర్సీబీ కెప్టెన్ మాట్లాడుతూ, "భువీ ఒక లెజెండ్. ఆయన అనుభవం జట్టుకు ఎంతో ప్లస్ అవుతుంది. 200 వికెట్లు తీయడం సామాన్యమైన విషయం కాదు, అది కూడా ఒక పేసర్‌గా చిన్నస్వామి వంటి స్టేడియాల్లో ఆడటం గర్వకారణం" అని కొనియాడారు. సోషల్ మీడియాలో కూడా 'భువీ 200' అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. 36 ఏళ్ల వయస్సులో కూడా భువనేశ్వర్ కుమార్ తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ యువ బౌలర్లకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన స్వింగ్ బౌలింగ్ ఇంకా చెక్కుచెదరలేదని ఈ రికార్డు నిరూపిస్తోంది. రాబోయే మ్యాచ్‌లలో ఆయన మరిన్ని వికెట్లు పడగొట్టి తన రికార్డును మరింత పటిష్టం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# వర్షార్పణం..

**కోల్‌కతా, పంజాబ్ పోరుకు వరుణుడి ఆటంకం**
**ఇరు జట్లకు చెరో పాయింట్**



కోల్‌కతా : సాఫీగా సాగుతున్న ఐపీఎల్‌లో అనూహ్యంగా వరుణుడు తొలి గోల్ కొట్టాడు. సోమవారం ఈడెన్‌గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం అంతరాయంతో అర్ధాంతరంగా రైద్దెంది. ముందస్తు హెచ్చరికల ప్రకారమే మ్యాచ్ ఆరంభమైన పదిహేను నిమిషాలకే వరుణుడు ఈడెన్‌గార్డెన్స్‌ను వర్షంలో ముంచెత్తాడు. సుమారు రెండుగంటల తర్వాత వర్షం తగ్గినా అప్పటికే ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో ఆట సాధ్యం కాదని తేల్చిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్టు ప్రకటించారు. ఇరుజట్లకు తలా ఒక పాయింట్ దక్కింది.

## 3 ఓవర్లు కూడా పడకుండానే..

టాస్ గెలిచిన కోల్‌కతా.. మొదట బ్యాటింగ్‌కు వచ్చి ఆరంభంలోనే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. బార్ట్‌లెట్ రెండో ఓవర్లో ప్రమాదకర ఫిన్ అలెన్ (6)తో పాటు రూ. 25 కోట్ల ఆటగాడు కామెరూన్ గ్రీన్ (4)ను ఔట్ చేసి ఆ జట్టును దెబ్బతీశాడు. అదే బార్ట్‌లెట్ మ–రుసటి ఓవర్ విసిరేందుకు రాగా నాలుగు బంతులు పడగానే వర్షం రావడంతో ఆట ఆగిపోయింది. ఆట నిలిచే సమయానికి 3.4 ఓవర్లకు 25/2తో నిలిచింది.

## ఏడేండ్ల తర్వాత వరుణ్, నరైన్ లేకుండా..

కేకేఆర్ ఈ మ్యాచ్ కోసం తుది జట్టులో రెండు కీలక మార్పులు చేసింది. మిస్టరీ స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ లేకుండానే ఆ జట్టు బరిలోకి దిగింది. ఈ ఇద్దరూ జట్టులో లేకుండా మ్యాచ్ ఆడటం కోల్‌కతాకు గత ఏడేండ్ల (2019 లో చివరిసారి)లో ఇదే ప్రథమం. జట్టు ప్రాక్టీస్‌లో క్యాచ్ అందుకుంటుండగా వరుణ్‌కు గాయమవడంతో అతడు మ్యాచ్‌కు దూరమయ్యాడని కెప్టెన్ రహానే చెప్పినా ఇటీవల కాలంలో అతడు ఫామ్‌లేమితో తంటాలు పడుతుండటంతో అతడిని పక్కనబెడతారన్న వార్తలు వచ్చాయి. నరైన్‌ను కూడా కేకేఆర్ సరిగ్గా వినియోగించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నా ఈ మ్యాచ్‌లో అనారోగ్యం కారణంగా అతడిని పక్కనబెట్టడం గమనార్హం.



# చెన్నై బౌన్స్ బ్యాక్ అవ్వగలదా?

ఐపీఎల్ 19వ సీజన్ (2026)లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్థానం ఆందోళనకరంగా మారింది. ఆదివారం రాత్రి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన హై–వోల్టేజ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో 43 పరుగుల తేడాతో ఓటమిపాలై, ఈ సీజన్‌లో వరుసగా మూడవ పరాజయాన్ని మూటగట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆర్సీబీ ఆధిపత్యం ముందు రుతురాజ్ గైక్వాడ్ సేన చేతులెత్తేసింది. టాస్ గెలిచిన చెన్నై మొదట బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు చుక్కలు చూపించారు. నిర్ణీత 20 ఓవర్లలో ఆర్సీబీ 250/3 పరుగుల భారీ స్కోరు సాధించింది. విరాట్ కోహ్లీ (28) త్వరగా నిష్క్రమించినప్పటికీ, దేవ్‌దత్ పడిక్కల్ (50) మరియు ఫిల్ సాల్ట్ (46) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. అయితే, అసలు విధ్వంసం చివర్లో మొదలైంది. టిమ్ డేవిడ్ కేవలం 25 బంతుల్లో 8 సిక్సర్లతో 70 పరుగులు చేసి అజేయంగా నిలవగా, రజత్ పటిదార్ (48లి) మెరుపులు మెరిపించారు. వీరిద్దరి ధాటికి చెన్నై బౌలర్లు ఖలీల్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. 251 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (7), సంజూ శాంసన్ (9) విఫలమయ్యారు. సర్ఫరాజ్ ఖాన్ (50) అద్భుతమైన అర్ధ సెంచరీతో పోరాడినప్పటికీ, మిగిలిన బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం అందలేదు. శివమ్ దూబే (18), ప్రశాంత్ వీర్ (43), జేమీ ఓవర్టన్ (37) మెరుపులు మెరిపించినా లక్ష్యం చాలా దూరంలో ఉండిపోయింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో చెలరేగగా, కృనాల్ పాండ్యా కీలకమైన వికెట్లు పడగొట్టారు. చివరికి చెన్నై 207 పరుగులకు ఆలౌట్ అయింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోవడం చెన్నై అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. జట్టు ఎంపికలో లోపాలు, కీలక సమయాల్లో వికెట్లు పారేసుకోవడం, డెత్ ఓవర్లలో బౌలర్లు విఫలం కావడం సిఎస్కే పాలిట శాపంగా మారాయి. ముఖ్యంగా గైక్వాడ్, సంజూ శాంసన్ వంటి అగ్రశ్రేణి బ్యాటర్లు నిలకడ లేమితో ఇబ్బంది పడుతున్నారు.లీగ్ ఆరంభంలోనే వరుస ఓటములతో చెన్నై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. అయితే, ఐపీఎల్ చరిత్రలో చెన్నైకి ఇటువంటి పరిస్థితులు కొత్తేమీ కాదు. గతంలో కూడా తక్కువ పాయింట్లతో ఉండి ప్లే–ఆఫ్స్‌కు చేరిన సందర్భాలు ఉన్నాయి. కానీ, ఈసారి పోటీ చాలా తీవ్రంగా ఉండటం మరియు జట్టు సమతూకం లోపించడంతో పునరాగమనం అంత సులభం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. తదుపరి మ్యాచ్‌లలో గెలవాలంటే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు మరియు డెత్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



# సంజూ రాకతో సీఎస్‌కేకి శని పట్టుకుందా?

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి ఏమీ బాగోలేదు. వరుసగా మూడు మ్యాచుల్లో ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. అయితే, ఈ ఓటముల కంటే ఇప్పుడు సీఎస్‌కే అభిమానులను ఎక్కువగా బాధిస్తున్న విషయం.. స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఫామ్. రాజస్థాన్ రాయల్స్ నుంచి భారీ అంచనాల మధ్య ట్రేడింగ్ ద్వారా చెన్నైలోకి అడుగుపెట్టిన సంజూ, వరుసగా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం కావడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. మొన్నటి టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ప్రపంచ స్థాయి బౌలర్లను తన బ్యాటింగ్‌తో భయపెట్టిన సంజూ, ఇప్పుడు ఐపీఎల్‌లో మాత్రం చేతులెత్తేస్తున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన మొదటి మూడు మ్యాచుల్లో అతను చేసిన స్కోర్లు వరుసగా 6, 7, 9. అంటే మొత్తం మీద మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 22 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ గెలిచిన ఊపులో ఐపీఎల్‌ను ఊపేస్తాడని భావించిన అభిమానులకు సంజూ ఆటతీరు తీవ్ర నిరాశను కలిగిస్తోంది. సంజూ కేవలం పరుగులు చేయకపోవడమే కాదు, మైదానంలో అతని ప్రవర్తన కూడా చర్చనీయాంశంగా మారింది. చెన్నై జెర్సీలో సంజూ అస్సలు సంతోషంగా కనిపించడం లేదని, ఏదో అయిష్టంగా ఆడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ మాజీ కెప్టెన్‌గా సంజూలో ఉన్న ఆ కసి, ఆకలి ఇప్పుడు చెన్నైలో కనిపించడం లేదని ఫ్యాన్స్ అంటున్నారు. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తో జరిగిన మ్యాచ్‌లో కూడా సంజూ త్వరగా అవుట్ కావడంతో సోషల్ మీడియాలో స్టెప్ అసైడ్ సంజూ(సంజూ తప్పుకో) అనే హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది. ఒక చెన్నై అభిమాని ఎక్స్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. "ప్రియమైన సంజూ.. నీవు మానసికంగా ఈ టీమ్‌తో కనెక్ట్ కాలేకపోతే, దయచేసి కొన్ని మ్యాచులు పక్కన కూర్చో. మైదానంలో కెమెరా నీవైపు తిరిగిన ప్రతిసారీ నువ్వు అసహనంగా కనిపిస్తున్నావు. నీలో ఆ గెలుపు కసి, వేగం ఎక్కడ పోయాయి? కనీసం నువ్వు టీమ్ కోసం ఆడుతున్నావు అన్నట్లుగా అయినా నీ బాడీ లాంగ్వేజ్ ఉండాలి కదా" అంటూ తీవ్రంగా స్పందించారు. శాంసన్ కేరళ కుర్రాడు కావడంతో సౌత్ లో అతనికి ఉన్న విపరీతమైన క్రేజ్, ఇప్పుడు నెగటివ్ గా మారుతోంది. బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ విఫలమైంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. ట్రిమ్ డేవిడ్ (70), దేవదత్ పడిక్కల్ (50), రజత్ పాటిదార్ (48) మెరుపు ఇన్నింగ్స్‌లతో 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో చెన్నై మొదట్లోనే తడబడింది. టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో కేవలం 30 పరుగులకే కీలక వికెట్లు కోల్పోయింది. చివర్లో సర్ఫరాజ్ ఖాన్ (50), ప్రశాంత్ వీర్ (43) పోరాడినా.. చెన్నై 207 పరుగులకే పరిమితమై 43 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. వరుస ఓటములతో సతమతమవుతున్న చెన్నైకి సంజూ ఫామ్ ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది.



## చిన్న వయసులోనే జాన్వీ అంత ఇబ్బంది పడిందా?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. చిన్న వయసులోనే డీప్‌ఫేక్ టెక్నాలజీ కారణంగా ఎదుర్కొన్న చేదు అనుభవాన్ని ఆమె ఒక పాడ్ కాస్ట్ లో రీసెంట్ గా వెల్లడించారు. ఈ సంఘటన తనపై ఎంత ప్రభావం చూపిందో చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రస్తుతం ఆమె కామెంట్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. జాన్వీ తెలిపిన వివరాల ప్రకారం, తాను కేవలం 15 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఆ ఇష్యూ జరిగింది. అప్పట్లో స్కూల్ లో చదువుకుంటున్న సమయంలోనే ఒక రోజు తన స్నేహితులు అశ్లీల వెబ్ సైట్ లో తన ఫోటోలు ఉన్నాయని చెప్పారని గుర్తు చేసుకున్నారు. అయితే అవి అసలు తన ఫోటోలు కాకుండా, మార్ఫింగ్ లేదా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా తయారు చేసినవని తర్వాత తెలిసిందని చెప్పారు. ఆ సంఘటన గురించి తెలుసుకున్న క్షణంలో తాను తీవ్రంగా షాక్ కు గురయ్యానని, ఏమి చేయాలో అర్థం కాలేదని జాన్వీ చెప్పారు. “ఆ సమయంలో చాలా ఒత్తిడికి లోనయ్యాను. ఎంతో బాధ పడ్డాను. ఒక చిన్న వయసులో ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవడం చాలా కష్టంగా అనిపించింది” అని ఆమె పేర్కొన్నారు. ఆ ఘటన తనకు సోషల్ మీడియాలో మోరల్ వాల్యూస్ ఎంత తక్కువగా ఉన్నాయో అర్థమయ్యేలా చేసిందని జాన్వీ వెల్లడించారు. “ఎవరో చేసిన పనికి నేను బాధపడాల్సి రావడం చాలా అన్యాయం అనిపించింది. అప్పుడే భవిష్యత్తులో కూడా ఇలాంటి సమస్యలు ఎదురవుతాయని అర్థమైంది” అని చెప్పారు. ఇక డీప్‌ఫేక్ సమస్య ఇప్పటికీ తనను వెంటాడుతూనే ఉందని జాన్వీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ తనకు సంబంధించిన ఏఐ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంటాయని అన్నారు. కొన్నిసార్లు చాలా మంది కూడా అవే తన ఒరిజినల్ పిక్స్ గా భావించి వైరల్ చేస్తున్నారని తెలిపారు. “అందుకే కొన్ని సందర్భాల్లో దీనిపై గట్టిగా మాట్లాడాలని అనిపిస్తుంది. కానీ నాకు అంత పవర్ లేదా వాయిస్ ఉందా అన్న సందేహంతో మౌనంగా ఉండిపోతా” అని జాన్వీ అన్నారు. అయితే ఇప్పుడు ఇలాంటి డీప్ ఫేక్ చిత్రాలను ఎక్కువగా పట్టించుకోకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. అయితే జాన్వీ ఇష్యూ ద్వారా సోషల్ మీడియాలో టెక్నాలజీ దుర్వినియోగం ఎంత డేంజరో మరోసారి స్పష్టమవుతోంది. ఇదిలా ఉండగా, జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్ లోనే కాకుండా సౌత్ సినిమాల్లో కూడా తనదైన గుర్తింపు తెచ్చుకుంటోంది. ముఖ్యంగా తెలుగులో తెరకెక్కుతున్న పెద్ది చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఆమె.. ఆ సినిమాలో రామ్ చరణ్ సరసన సందడి చేయనుంది.


# లవ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఓటిటి పోటీ

లవ్‌టుడే, డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు తమిళ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తున్నాడు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. థియాట్రికల్ రిలీజ్‌కు ముందే ఈ మూవీకి డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోతో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఓటీటీ డీల్ కుదిరినట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. నాలుగు వారాల థ్రియాట్రికల్ రన్ తర్వాత మిడ్ మేలో ఈ మూవీ ఓటీటీ డెబ్యూ ఇవ్వనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌లో ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది.. మనమిప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందనే అంటున్నాడు.. ఉందండి.. ఈ లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ ఇంకా ఉందండి. అది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది. తల నుంచి కాలి వేలి వరకు ఒక ఫీలింగ్ వచ్చింది మామ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ యూత్ ఫుల్ స్టోరీతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెబుతున్నాయి. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ఈ మూవీని రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని టీజర్‌లో హింట్ ఇచ్చింది విఘ్నేశ్ శివన్ టీం.



# రిలీజ్‌కు ముందే పెద్ది సంచలనాలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా, రిలీజ్‌కు ముందే భారీ డీల్‌తో 'పెద్ది' సినిమా ట్రేడ్ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లోనూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది.



## విజయ్‌తో ఎఫైర్ రూమర్లపై ఆసక్తికర పోస్టులతో స్పందించిన త్రిష

స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్, నటుడు విజయ్‌తో ప్రేమలో ఉన్నారంటూ సాగుతున్న ప్రచారంపై పరోక్షంగా స్పందించారు. ఈ ఊహాగానాలపై ఆమె నేరుగా వ్యాఖ్యానించకపోయినా, తన సోషల్ మీడియాలో పెట్టిన కొన్ని అర్థవంతమైన పోస్టులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు, నెటిజన్లు ఈ పోస్టుల వెనుక ఆంతర్యాన్ని విశ్లేషిస్తున్నారు. తన సోషల్ మీడియా ఖాతాలో త్రిష షేర్ చేసిన కోట్స్ ఆకర్షిస్తున్నాయి. 'మన శాంతికి భంగం కలిగించే దేన్నైనా వదిలేయాలి', 'మీ విలువ మీకు తెలిసినప్పుడు, ఇతరుల మాటలు మిమ్మల్ని బాధించలేవు' అనే అర్థం వచ్చేలా ఉన్న ఈ పోస్టులు.. తనపై వస్తున్న పుకార్లకు సమాధానంగానే పెట్టారని పలువురు భావిస్తున్నారు. కొన్నిసార్లు మౌనమే ఉత్తమ సమాధానం అనే భావనను కూడా ఆమె పంచుకున్నారు. గతంలో విజయ్, త్రిష జంటగా నటించిన 'లియో' సినిమా సమయంలో వీరి మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ ప్రచారం మొదలైంది. ఇటీవల వీరిద్దరూ విదేశాల్లో కలిశారంటూ కొన్ని ఫోటోలు వైరల్ కావడంతో ఈ పుకార్లు మళ్లీ ఊపందుకున్నాయి. అయితే, ఆ ఫోటోలు మార్ఫింగ్ చేసినవని కొందరు కొట్టిపారేస్తున్నారు. ఈ రూమర్ల నడుమ త్రిష తన కెరీర్‌పైనే పూర్తి దృష్టి సారించారు. ప్రస్తుతం ఆమె పలు భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. అనవసరమైన ప్రచారాన్ని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతున్నారని ఆమె అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# గుండ్లపల్లి వద్ద బీజేపీ జెండా గద్దె ఆవిష్కరణ

# సిద్ధాంతమే పార్టీ బలం: బండి సంజయ్

కరీంనగర్, ఏప్రిల్ 06: గన్నేరువరం మండలం గుండ్లపల్లి స్టేజ్ వద్ద సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బీజేపీ జెండా గద్దెను ఆవిష్కరించారు. భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, బీజేపీ తన సిద్ధాంతం, భావజాలంతోనే ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా ఎదిగిందని, క్యాడర్ ఆధారిత పార్టీగా బీజేపీ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన పార్టీ నేడు దేశాన్ని పాలించే స్థాయికి ఎదిగి, వరుసగా మూడు సార్లు కేంద్రంలో అధికారంలోకి రావడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. "నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్" అనే సిద్ధాంతం బీజేపీకి బలమని పేర్కొన్నారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని అమలు చేస్తూ అర్హులైన పేదలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే కేంద్రంలోని మోదీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు




గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కరివేద మహిపాల్ రెడ్డి, పుల్లెల పవన్ కుమార్, సొల్లు అజయ్ వర్మ, ముత్యాల జగన్ రెడ్డి, సోమరాజు రెడ్డి, పకిడి మహేందర్, పుల్లెల రాము, బొమ్మిడి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గన్నేరువరం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ పార్టీ జెండాను ఎగరవేశారు.

## రామాయణం నీతి నేటికీ ఆదర్శనీయమే: జెఎస్ఆర్



చిగురుమామిడి,జనత న్యూస్: మండలంలోని గాగిరెడ్డిపల్లె గ్రామంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న చిరుతల రామాయణం నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెఎస్ఆర్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక యుగంలో ముందుకు సాగుతున్న నేటి తరానికి మన సంస్కృతి, సాంప్రదాయాల విలువలను తెలియజేయడం అత్యంత అవసరమని అన్నారు. అదే ఉద్దేశంతో చిరుతల రామాయణం వంటి నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు, నిర్వాహకులు అభినందనీయులని పేర్కొన్నారు. సెల్‌ఫోన్, ఇంటర్నెట్ ప్రభావంతో వేగంగా మారుతున్న ఈ కాలంలో తల్లిదండ్రుల పట్ల గౌరవం, కుటుంబ బంధాలు, బాధ్యతలు వంటి విలువలను నాటకాల ద్వారా సమాజానికి గుర్తుచేస్తున్న కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం జెఎస్ఆర్‌ను గ్రామ పాలకవర్గ సభ్యులు, కళాకారులు, గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు.

## హుస్నాబాద్‌లో ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



హుస్నాబాద్,జనత న్యూస్: భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలోని ఆరేపల్లి చౌరస్తాలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 1980లో అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీ సారథ్యంలో దేశాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. కార్యకర్తల అసమాన త్యాగాల వల్లే రెండు ఎంపీ స్థానాల నుండి నేడు 300కు పైగా స్థానాలకు చేరుకుని, దేశవ్యాప్తంగా తిరుగులేని శక్తిగా ఎదిగిందని కొనియాడారు. తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ పతాకాన్ని బత్తుల శంకర్ బాబు ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు గంగిశెట్టి గాంధీ, తోట సమ్మయ్య, వరియోగుల అనంతస్వామిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాయిత అరుణ్ రెడ్డి, వెల్దండి సంతోష్, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గాదాసు రాంప్రసాద్, కార్యదర్శులు వడ్డేపల్లె లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు, శక్తి కేంద్ర ఇంచార్జీ నారోజు నరేష్, నాయకురాలు లకావత్ శారద పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారులపై పంటలు ఎండబెడితే చర్యలు

**ప్రమాదాలకు ఆస్కారం.. వెంటనే తొలగించాలి**

**రైతులకు చిగురుమామిడి ఎస్సై సూచన**



చిగురుమామిడి,జనత న్యూస్: రైతులు తమ పండించిన పంటలను ప్రధాన రహదారులపై ఎండబెట్టడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చిగురుమామిడి ఎస్సై హెచ్చరించారు. సోమవారం మండలంలోని బొమ్మనపల్లి, రేకొండ దారిలో రహదారిపై ధాన్యం ఆరబోసిన రైతులతో ఆయన నేరుగా మాట్లాడారు. రోడ్లపై పంటలు పోయడం వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతుందని, ఇది చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు. రోడ్లపై ఉన్న పంటను వెంటనే తొలగించాలని రైతులకు సూచించారు. రైతులు తమ పంటలను వ్యవసాయ భూముల్లో లేదా ప్రభుత్వం కేటాయించిన ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఎండబెట్టుకోవాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి రహదారులపై పంటలు ఆరబోస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ప్రతి రైతు ఈ విషయాన్ని గమనించి పోలీసు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా చిరుతల రామాయణం సాంస్కృతిక ప్రదర్శన



ఇల్లంతకుంట, ఏప్రిల్ 07: అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో చిరుతల రామాయణం సాంస్కృతిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రంగస్థలం కళాకారుల అసోసియేషన్ జిల్లా శాఖతో పాటు ఇల్లంతకుంట, జమ్మికుంట మండల శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గురువు కోడూరు తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమ్మిరెడ్డి పర్యవేక్షణలో మల్యాల గ్రామ కళాకారులు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను అలరించారు. చివరి రోజు ఆంజనేయుడు లంకకు బయలుదేరే సన్నివేశం నుండి రావణ వధ వరకు జరిగిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రంగస్థలం కళాకారుల అసోసియేషన్ జిల్లా కోశాధికారి నలగోని రమేష్, శంకరపట్నం మండల అధ్యక్షుడు దొంగల రాజయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు కోడూరు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల కళాకారులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కో ఆప్షన్ సభ్యులుగా దరఖాస్తులు



సిరిసిల్ల. ఏప్రిల్ 6. జనతా న్యూస్. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో భాగంగా సోమవారం బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన కో ఆప్షన్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సయ్యద్ తస్లీం, నంది శంకర్, సయ్యద్ సోహెల్, కొండ అనూష శ్రీనివాస్ సిరిసిల్ల మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల అధికారి సాయి కృష్ణ కు నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి , వైస్ చైర్మన్ దార్ల సందీప్ , కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## "సెస్" విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు..!

**అన్నల్దాస్ భాను, కాంగ్రెస్ పార్టీ నాయకులు.**




సిరిసిల్ల. ఏప్రిల్ 6. జనత న్యూస్. సెస్ విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించొద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నలాస్ భాను అన్నారు. సోమవారం సిరిసిల్లలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి భాను మాట్లాడుతూ సెస్ విషయంలో అనేక అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బిఆర్ఎస్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెస్ నష్టాల్లో కురుకుపోవడానికి కారణమైన నాయకుల విషయంలో స్పందించని తీరుపై విస్మయం వ్యక్తం చేశారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే అప్పటి విద్యుత్ నియంత్రణ మండలి మాజీ అధ్యక్షులు ఫిర్యాదు చేయడం వల్లే సెస్ లైసెన్స్ రెన్యువల్ కాలేదనే విషయాన్ని గుర్తు చేశారు. సాక్షాత్తు అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సెస్ పాలకవర్గం తీరును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. తక్షణమే గతంలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్. చేశారు. ఎన్పీడీసీఎల్ పర్యవేక్షణలో మూడు రోజుల్లోనే ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు సంబంధించిన సమస్యలు పరిష్కారం అయ్యాయని అన్నారు. నాలుగవ కేటగిరి నుండి మూడవ గెటగిరికి మార్చిన అప్పటి మంత్రి స్థానిక శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సెస్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తున్న ఎన్పీడీసీఎల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలకు కారణమైన పరిస్థితులను చక్కదిద్ది సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అందించే విద్యుత్తును మూడవ కేటగిరి నుండి మళ్లీ నాలుగవ కేటగిరికి తీసుకొచ్చిన ఎన్పీడీసీఎల్ అధికారులకు నేత పారిశ్రామికుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను పక్కదారి పట్టించే చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని బిఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి అన్నారు. సమావేశంలోపలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగంపల్లి గంగరాజు, వంగ శ్రవణ్, పిట్టల దేవరాజ్, సబ్బని వేణు పాల్గొన్నారు.

## వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి "ఎన్పీడీసీఎల్" చేయూత.

**ఆడెపు భాస్కర్, పాలిస్టర్ అసోసియేషన్, అధ్యక్షులు.**




సిరిసిల్ల. ఏప్రిల్ 6. జనతా న్యూస్. సెస్ పరిధిలోని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ లో ఉన్న విద్యుత్ సమస్యలకు సంబంధించి పరిష్కారం చూపి పరిశ్రమకు చేయూత అందించారని పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడెపూ భాస్కర్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి వస్త్ర పరిశ్రమ అనుబంధం పరిశ్రమ ల నిర్వాహకులతో జరిపిన సమావేశంలో బ్యాక్ బిల్లు పేరుతో ఉత్పన్నం అవుతున్న సమస్యలకు పరిష్కారం చూపారని తెలిపారు. వస్త్ర పరిశ్రమకు సంబంధించి ఇప్పటివరకు మూడో కేటగిరీలో ఉన్న విద్యుత్ మీటర్లను మళ్లీ నాలుగవ కేటగిరీలోకి మార్చడం వల్ల వస్త్ర పరిశ్రమకు చేయూత ఇచ్చినట్లు అయ్యిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్పీడీసీఎల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, సంగీతం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ తో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం, ఎన్పీడీసీఎల్ అధికారులు తీసుకున్న నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నేతన్న విగ్రహం వద్ద పాలభిషేకం నిర్వహించనున్నట్లు ఆడెపు భాస్కర్ తెలిపారు. సమావేశంలో పాలిస్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకారపు రవి, కళ్యాణపు సుభాష్, దూడం శంకర్, గోవింద్ రవి, మండల సత్యం, బోద్దుల సుదర్శన్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించాలి

**కౌన్సిలర్ వాల సుప్రజ నవీన్ రావ్**

**18వ వార్డులో ఘనంగా ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం, అన్నప్రాసన**



హుస్నాబాద్,జనత న్యూస్: చిన్నారుల ఆరోగ్య సంరక్షణతో పాటు గర్భిణులు, బాలింతల పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని 18వ వార్డు కౌన్సిలర్, ఆరోగ్య లక్ష్మి కమిటీ చైర్మన్ వాల సుప్రజ నవీన్ రావ్ సూచించారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు ఆమె అన్నప్రాసన చేశారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం చిన్నారుల నుంచే మొదలవుతుందని, వారికి సరైన సమయంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సావుల రేణుక, ఆశా కార్యకర్తలు స్వరూప, తుమ్మ సంపూర్ణ, కమిటీ సభ్యులు తూర్పటి అనూష, దీప్తి, సంధ్యా, సృజన, శిరీష, గౌతమి, రేణుక, స్వాతి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు రఘునాథరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన జేఎస్ఆర్



చిగురుమామిడి,జనత న్యూస్: ఇందుర్తి పాల సంఘం తొలి అధ్యక్షుడు, మాజీ వీఆర్వో గాదె బాల్‌రెడ్డి ఇటీవల మరణించగా.. సోమవారం ఆయన కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్) పరామర్శించారు.మండలంలోని అరకాలపల్లి గ్రామంలోని బాల్‌రెడ్డి నివాసానికి వెల్లిన ఆయన.. బాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బాల్‌రెడ్డి కుమారుడు, సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాల్‌రెడ్డి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## గాగిరెడ్డిపల్లెలో వైభవంగా శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవం

ముగిసిన చిరుతల రామాయణం నాటక ప్రదర్శనలు





చిగురుమామిడి,జనత న్యూస్: చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీ రామాంజనేయ భజన బృందం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన చిరుతల రామాయణం నాటక ప్రదర్శనలు సోమవారంతో ఘనంగా ముగిశాయి.తెలంగాణ జానపద సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ కళారూపాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఆస్వాదించారు.కళాకారులు పోషించిన వివిధ పాత్రలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా శ్రీ సీతారాముల పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే 'ఓడి బియ్యం పోయుట' వంటి సంప్రదాయ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై ఓడి బియ్యం పోసి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.మూడు రోజులపాటు సాగిన ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన గ్రామస్తులకు, పరిసర గ్రామాల ప్రజలకు, భక్తులకు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ నాటకంలో పంతుళ్లు కల్వల చంద్రారెడ్డి, అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, కల్వల రాజేశ్వర్ రెడ్డి (దశరథుడు), కల్వల చంద్రారెడ్డి (రాముడు), మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేష్ (లక్ష్మణుడు), కల్వల మనీష్ రెడ్డి (భరతుడు), అన్నాడి మల్లికార్జున్ రెడ్డి (రావణబ్రహ్మ), ఆరాధ్య (శత్రుఘ్నుడు), రాజయ్య (విశ్వామిత్రుడు), కొమురయ్య (వశిష్ఠుడు), రాజిరెడ్డి (జనకుడు), సంపత్ (మారిచుడు), మధు (సుభాహుడు), చంద్రయ్య (ఇంద్రజిత్), తిరుపతి (అక్షయుడు), రాజిరెడ్డి (విభీషణుడు), సంపత్ (కుంభకర్ణుడు), తిరుపతి (జటాయువు, సుగ్రీవుడు), ప్రభాకర్ రెడ్డి (ఆంజనేయుడు), రాజయ్య (వాలి), బిట్టు (అంగదుడు), రాజిరెడ్డి (సముద్రుడు), తిరుపతి (బ్రాహ్మణుడు), అశ్విత్ (జాంబవంతుడు), సమ్మయ్య (కైకేయి), సదానందం (సీత), సమ్మయ్య (అహల్య), తిరుపతి (మందర), సమ్మయ్య (మండోదరి), భూమయ్య (సుగంధి), ముత్తయ్య (లంకిని), మధు (సురస), వెంకటేశం (తాటకి), సంపత్ రెడ్డి (తార), కొమురెల్లి (శబరి) తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించాలి




కరీంనగర్, ఏప్రిల్ 07: నగరపాలక సంస్థ ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 21 దరఖాస్తులు అందగా, అందులో ఇంజనీరింగ్ విభాగానికి 6, టౌన్ ప్లానింగ్‌కు 5, ఇందిరమ్మకు 1, సానిటేషన్‌కు 1, రెవెన్యూ విభాగానికి 7, రికార్డు సెక్షన్‌కు 1 దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విభాగాల వారీగా వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# ఎర్లీ బర్డ్ స్కీమ్ 5% రాయితీని సద్వినియోగం చేసుకోండి



కరీంనగర్, ఏప్రిల్ 07: "ఎర్లీ బర్డ్" స్కీమ్‌లో 5 శాతం రాయితీని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించిన మేయర్, 2026--2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల చెల్లింపుల కౌంటర్లను పరిశీలించారు. ఎర్లీ బర్డ్ స్కీమ్‌లో ప్రజలు చెల్లిస్తున్న పన్నుల వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 5 శాతం రాయితీతో ఆస్తి పన్నులు చెల్లించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తుండటంతో కౌంటర్ల సంఖ్య పెంచాలని, పౌరులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ అందిస్తున్న 5 శాతం రాయితీ అవకాశాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. పన్నులు చెల్లించేందుకు వచ్చే పౌరులు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పౌర సేవా కేంద్రంలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయడం, త్రాగునీరు, కూలర్లు, సీనియర్ సిటిజన్లకు కూర్చునేందుకు బెంచీలు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని, రాయితీ అవకాశాన్ని ఉపయోగించుకొని వడ్డీ భారాన్ని తగ్గించుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియ-ద్దీన్, ఆర్వో శివప్రసాద్, కార్పొరేటర్లు కాజ రమ శివరాం, బండ రమణారెడ్డి, భారీ అపర్ణ జితేందర్, చంద్ర, సోమిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కరీంనగర్, ఏప్రిల్ 07: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (PMSBY), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY) పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో గాయత్రి బ్యాంకు సేవింగ్స్ ఖాతాదారుడైన మడ్డి తిరుపతి కుటుంబానికి ఈ పథకం కింద మంజూరైన బీమా చెక్కును మేయర్ తన చేతుల మీదుగా అందజేశారు. మడ్డి తిరుపతి జీవన్ జ్యోతి బీమా యోజన కింద బీమా చేయించుకోగా, ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. దీంతో ఈ పథకం ద్వారా రూ.2 లక్షల బీమా నగదును అతని భార్య, నామినీ మడ్డి వనజకు అందజేశారు. చెక్కు అందుకున్న వనజ, కేంద్ర ప్రభుత్వం, మేయర్ కొలగాని శ్రీనివాస్, బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ బీమా పథకాల ద్వారా చిన్న మొత్తంలో ప్రీమియం చెల్లించి పెద్ద మొత్తంలో భద్రత పొందవచ్చని తెలిపారు. సంవత్సరానికి కేవలం రూ.436 చెల్లిస్తే కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రీమియం ఆటో డెబిట్ విధానంలో బ్యాంకు ఖాతా నుంచి కట్ అవుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు ఈ పథకాలను వినియోగించుకొని తమ కుటుంబానికి భద్రత కల్పించుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ జి. అశోక్, అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీనగర్ కవల ఆడపిల్లల హత్య కేసు ఛేదన: కన్నతండ్రితో సహా నలుగురు అరెస్ట్




కరీంనగర్, ఏప్రిల్ 06: జూబ్లీనగర్‌లో జరిగిన కవల ఆడపిల్లల హత్య కేసును కరీంనగర్ రూరల్ పోలీసులు ఛేదించి, కన్నతండ్రితో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను అరెస్ట్ చేశారు. ఆస్తిపై మక్కువతో పాటు ఆడపిల్లలపై వివక్ష కారణంగా ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌కు చెందిన కచ్చు శ్రీశైలం ప్రతిమ మెడికల్ కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో మౌనికతో వివాహం కాగా, 2022లో వీరికి కవల ఆడపిల్లలు గీతంశి, గీతన్విక జన్మించారు. అయితే మగబిడ్డ కోరికతో ఉన్న శ్రీశైలం ఆడపిల్లలు పుట్టడాన్ని అంగీకరించలేకపోయాడు. సుమారు రెండు కోట్ల ఆస్తి ఆడపిల్లల పెళ్లిళ్లకే సరిపోతుందని భావించి, తన తల్లిదండ్రులు అశోక్, లావణ్య మరియు తమ్ముడు రాకేష్‌తో కలిసి పిల్లలను హత్య చేయాలని పథకం వేశాడు. ఏప్రిల్ 3న భార్యను ఇంట్లోనే ఉండమని చెప్పి, ఇద్దరు చిన్నారులను మోటార్ సైకిల్‌పై పొలం వద్దకు తీసుకెళ్లాడు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో పథకం ప్రకారం చిన్నారులను బావిలోకి తోసివేశాడు. ప్రాణాల కోసం పోరాడుతున్న ఒక చిన్నారిని కూడా బావిలోకి దిగి నీటిలో ముంచి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం అనుమానం రాకుండా కాపాడుతున్నట్లు నటించాడు. నిందితుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సి.ఐ. నిరంజన్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు గోపాల్‌పూర్‌లో తలదాచుకున్నట్లు గుర్తించి ఏప్రిల్ 5న అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారు. ఈ కేసులో కచ్చు శ్రీశైలం (తండ్రి), కచ్చు అశోక్ (తాత), కచ్చు లావణ్య (నానమ్మ), కచ్చు రాకేష్ (బాబాయ్)లను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన గ్లామర్ మోటార్ సైకిల్ మరియు ఒక వివో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన రూరల్ ఏసీపీ విజయకుమార్, సి.ఐ. నిరంజన్ రెడ్డి మరియు సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి



కరీంనగర్, ఏప్రిల్ 07: ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే (స్థానిక సంస్థలు), లక్ష్మి కిరణ్ (రెవెన్యూ), ఆర్డీవోలు రమేష్ బాబు, మహేశ్వర్‌లతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణికి మొత్తం 233 దరఖాస్తులు రాగా, వాటిలో అత్యధికంగా కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధి నుంచి 82 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com